క్లుప్తంగా

మొదలైన కల్వర్టు సైడ్‌వాల్ పనులు


కల్వర్టును పరిశీలిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

సాక్షి ఎఫెక్ట్..

కోల్‌సిటీ: గోదావరిఖని ఫైవింక్లయిన్ ఏరియాలో ఎట్టకేలకు కల్వర్టుకు ఇరువైపులా సైడ్‌వాల్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. ప్రమాదకరంగా మారిన కల్వర్టుపై 21న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన బల్దియా కమిషనర్(ఎఫ్ఏసీ) జె.అరుణశ్రీ గురువారం నేరుగా కల్వర్టును పరిశీలించారు. కల్వర్టు దగ్గర ప్రమాదాలు జరగకుండా సైడ్‌వాల్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

సమ్మె విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి


గోదావరిఖని: సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం వచ్చేనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. ఆర్జీ–1 ఏరియా జీడీకే–2వ గనిపై గురువారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే సమ్మెలో కార్మికవర్గం పాల్గొనాలన్నారు. రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, పుప్పాల శ్రీనివాసరావు, వంగల రామన్న, అన్నబోయిన శంకరన్న, పెండెం సమ్మయ్య, తాళ్ల శ్రీనివాస్, బి.బీమానాయక్, జనార్దన్‌రెడ్డి, బొంకూరి సురేశ్, చందు, సాయి ప్రకాశ్, మల్కా కార్తీక్, కొమురయ్య, సంపత్, సందీప్, రాకేశ్, భరత్, సాయికిరణ్, ఈశ్వర్, కార్మికులు పాల్గొన్నారు.

ఆవిష్కృత్–2025 పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి: మంథని జేఎన్టీయూ కళాశాలలో మే 7,8 తేదీల్లో నిర్వహించనున్న టెక్నికల్ ఫెస్ట్‌కు సంబంధించిన ఆవిష్కృత్ 2025 పోస్టర్‌ను ప్రిన్సిపాల్ విష్ణువర్దన్ గురువారం ఆవిష్కరించారు. కళాశాల ప్రాంగణంలో ఆవిష్కృత్ 2025లో ఆరు బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు టెక్నికల్, నాన్ టెక్నికల్, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహిస్తారని, ప్రతీ బ్రాంచ్ ఒక ప్రత్యేకమైన ప్రాజెక్టును తయారు చేసి టెక్నికల్ ఫెస్ట్‌లో ప్రదర్శిస్తారని తెలిపారు. పరిపాలనాధికారి సుమన్‌రెడ్డి, పీడీ పింగిలి కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్లు శివ, అఖిల్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీదే విజయం


మాట్లాడుతున్న నాయకులు

ఓదెల: రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగరవేస్తుందని పార్టీ మండల ఇన్‌చార్జి కొమ్ము తిరుపతియాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఓదెలలో గురువారం బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న బూత్ కమిటీల సమావేశాలతో పార్టీ బలోపేతం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుల్ల సదయ్యాగౌడ్, సంపత్, శ్రీకాంత్, అనిల్‌రావు, కారెంగల నవీన్, అగ్గి శ్రీనివాస్, భూషణవేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జూలపల్లి: మండలంలోని మూడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించనున్నట్లు దూళికట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వడ్కాపూర్, కాచాపూర్‌లో, వెంకట్రావుపల్లె గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

శభాష్ టీచర్

- రెండేళ్లుగా తన నివాసంలోనే మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ
- ఇప్పటికే 150 మందికిపైగా శిక్షణ పొందిన మహిళలు
- ఆదర్శంగా నిలుస్తున్న టీచర్ శశికళ


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సింగరేణి సేవాసమితి అధ్యక్షురాలు అనిత, టీచర్ శశికళ

కోల్‌సిటీ: మహిళలను స్వయం ఉపాధి దిశగా నడిపించాలన్న సదుద్దేశంతో గోదావరిఖనిలో శశికళ అనే మహిళా టీచర్ అడుగు ముందుకేశారు. సింగరేణి స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న శశికళ, రెండేళ్ల నుంచి నిస్వార్థంగా మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వాలన్న సంకల్పంతో ప్రణాళిక రూపొందించుకున్నారు. తన ఇంటినే శిక్షణ కేంద్రంగా మార్చుకున్నారు. ఇప్పటికే 150 మంది మహిళలుకు ఉచిత శిక్షణ ఇవ్వగా, వారంతా ఉపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మరో 33మందికి సర్టిఫికెట్లు అందజేసి మహిళలను అభినందించారు. స్థానిక జీఎంకాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు సింగరేణి సేవాసమితి అధ్యక్షురాలు అనిత సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ మహిళలు ఇంట్లోనే ఉంటూ ఉపాధి పొందేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా శశికళ టీచర్ అందిస్తున్న సేవలు స్ఫూర్తిగా నిలిచాయని కొనియాడారు. రెండేళ్లుగా మహిళలకు మగ్గం, రోలింగ్, కుట్టు మిషన్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా మహిళలకు రోలింగ్ పరికరాలను కూడా స్వచ్ఛందంగా కొనివ్వడం అభినందనీయమన్నారు. రెండు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున ఇప్పటి వరకు ఏడు బ్యాచ్‌లతో 150 మందికిపైగా ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మగువ అధ్యక్షురాలు సునీత, ఉపాధ్యక్షురాలు శశికళ, సెక్రటరీ బీనాసింగ్, పద్మ, ట్రైనర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీలు, కొవ్వొత్తులతో నివాళి



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న నాయకులు



సుల్తానాబాద్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన


గోదావరిఖని: నిరసనలో బీజేపీ నాయకులు


సుల్తానాబాద్: నిరసనలో న్యాయవాదులు


ధర్మారంలో కొవ్వొత్తులతో నిరసన


జ్యోతినగర్: దిష్టిబొమ్మ దహనం

గోదావరిఖని: కశ్మీర్‌లో పర్యాటకులను తీవ్రవాదులు హతమార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తూ స్థానిక రమేశ్‌నగర్ ప్రధాన కూడలిలో బీజేపీ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో బీజేపీ నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో జీడీకే–5 ఓసీపీపై కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

పెద్దపల్లిరూరల్: కశ్మీర్‌లో ఉగ్రదాడి హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద గురువారం పార్టీ నాయకులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు.

ధర్మారం: మండల కేంద్రంలో సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో యువకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖని ప్రధాన చౌరస్తాలో నిరసన చేపట్టి, కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాదులు మున్సిఫ్ కోర్టు కాంపెక్స్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.

జ్యోతినగర్: హిందూవాహిని, బీజేపీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీ నుంచి జాతీయ పతాకాలతో మేడిపల్లి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో కృష్ణానగర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులు, ప్రజలు నివాళి అర్పించారు.

మంథని: మంథని మండలం విలోచవరంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలు నివాళి అర్పించారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని మున్సిఫ్ కోర్టులో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. నల్లబ్యాడ్జీలు ధరించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేశ్ రెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గోదావరిఖనిటౌన్: విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు.ప్లకార్డులతో నిరసన

కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె

రామగిరి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని మంథని జేఎన్టీయూ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె ఆరోరోజు కొనసాగింది. సమ్మెకు మద్దతుగా గురువారం కళాశాల విద్యార్థులు తరలివచ్చారు. పదేళ్ల నుంచి 30ఏళ్లుగా కొనసాగుతున్న అధ్యాకులను రెగ్యులరైజ్ చేసిన తర్వాత మిగిలిన పోస్టులను నిరుద్యోగుల కోసం కేటాయించి విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని అధ్యాపకులు కోరారు.


సమ్మెకు మద్దతు తెలుపుతున్న కళాశాల విద్యార్థులు

మేడే విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్యోతినగర్: కార్మికవర్గాన్ని నష్టాన్ని కలిగించే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాటాలను తీవ్రతరం చేద్దామని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వాలపై రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పోరాటాలకు సిద్ధం కావాలని, మేడే విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మేడే పోస్టర్ ఆవిష్కరించారు. బుచ్చన్న, కుమార్, గుండు రాజయ్య, రమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

26 నుంచి రాజీవ్ యువ వికాసానికి ఇంటర్వ్యూ

మంథని: రాజీవ్ యువవికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి 26 నుంచి 29 వరకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. మంథని మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయా బ్యాంకుల అధికారులు నిర్వహించే ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు సూచించిన బ్యాంకుల వారీగా హాజరు కావాలని సూచించారు. 26న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఏడీబీ), 28న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్, 29న యూనియన్, టీజీబీ, కెనరా, కేడీసీసీ, ఐసీఐసీఐతో ఆధార్, పాస్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం వెంట తీసుకురావాలన్నారు.

విలీనంపై గ్రామస్తుల నిరసన


నిరసన తెలుపుతున్న లింగాపూర్ ఉపాధి కూలీలు

రామగుండం: లింగాపూర్ గ్రామాన్ని రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నట్లు అధికారిక గెజిట్ రిలీజ్ కావడంపై గురువారం గ్రామస్తులు, ఉపాధి కూలీలు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నిరసన తెలిపారు. కార్పొరేషన్‌లో విలీనంతో ప్రతీ కుటుంబంపై పన్నులు, ఇతరత్రా రూపేణా ఆర్థిక భారం పడుతుందని, ఉపాధిహామీ పథకం రద్దవుతుందని, గ్రామస్థాయిలో జవాబుదారీతనం కొరవడుతుందని పేర్కొంటూ అధికారులు, ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు తెలిపారు. మాజీ సర్పంచులు ఇరికిళ్ల శంకరయ్య, అర్శనపల్లి మల్లేశ్వరి, శ్రీనివాస్, నిమ్మరాజుల రవి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి సబ్‌స్టేషన్‌లో పునరుద్ధరణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శంకర్ తెలిపారు. ఆకెనపల్లి, సోమనపల్లి, ఎగ్లాస్‌పూర్, పొట్యాల, విసంపేట, మద్దిర్యాల, బ్రాహ్మణపల్లి, అంతర్గాం, గోలివాడ, ముర్మూర్, ఎల్లంపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఉంటుందని పేర్కొన్నారు.

• నేడు భూభారతిపై అవగాహన

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి పథకంపై మండల పరిధిలోని రైతులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి కలెక్టర్ కోయ శ్రీహర్షతో పాటు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హాజరవుతారని చెప్పారు. మండలంలోని రైతులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు.

• రేణుక ఎల్లమ్మ ఆలయానికి విరాళం

ఎలిగేడు: మండలంలోని నర్సాపూర్‌లో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయానికి ఎలిగేడుకు చెందిన స్వర్గీయ బుర్ర కొండయ్యగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు బుర్ర జగదీశ్వర్‌గౌడ్, బుర్ర వీరస్వామిగౌడ్, బుర్ర ఆంజనేయులుగౌడ్ రూ.33,303 గురువారం అందజేశారు.

• జనావాసంలోకి జాతీయ పక్షి

గోదావరిఖని: వనం వదిలి జనావాసంలోకి వచ్చిన జాతీయ పక్షి నెమలి గురువారం స్థానికులకు చిక్కింది. సమీపంలోని ఓసీపీ–3 ఓబీ కుప్పల నుంచి విఠల్‌నగర్‌కు చేరుకుంది. నాయకులు బొడ్డుపల్లి రవీందర్ దాన్ని రక్షించి ఫారెస్ట్ ఆఫీసర్ రహ్మతుల్లాకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకుని నెమలిని స్వాధీనం చేసుకుని సమీప అడవిలో వదిలి పెడతామని అధికారులు పేర్కొన్నారు. తోకల పోశం, సారయ్య, బొడ్డు రాజయ్య, సౌందర్య, లక్ష్మి, సుదర్శన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

• 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో దొమ్మటి రాజేందర్ ఇంట్లో గురువారం 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ ఐత శ్రీనివాస్, ముత్తారం ఎస్సై గొపతి నరేశ్ పట్టుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రాజేందర్ ఇంట్లో సోదా చేయగా రూ.78,000 విలువ గల రేషన్ బియ్యం దొరికిందని అధికారులు తెలిపారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల సంబరాలు


స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

జూలపల్లి: యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్‌ను మెదక్ జిల్లా పీసీసీ అబ్జర్వర్‌గా నియామకమైనందుకు మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం స్వీట్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్, నాయకులు సంపత్, స్వామి, సంతోష్‌కుమార్, తెజేరాజ్, ప్రభాకర్ పాల్గొన్నారు.


జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో బస్టాండు వద్ద ప్రధానరోడ్డుపై మురుగు నీరు పారుతోంది. దుర్వాసన వెదజల్లుతోందని వాహనదారులు వాపోతున్నారు. మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

అధికారులతో సమీక్ష సమావేశం


సమావేశంలో కార్పొరేట్ స్టోర్స్ జీఎం ఎలీషా

రామగిరి: సింగరేణి సంస్థ కార్పొరేట్ స్టోర్స్ జీఎం పి.ఎలీషా గురువారం ఆర్జీ–3 ఏరియాలో పర్యటించారు. ఏరియాలోని ఓసీపీ–1, 2 గనులను సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి జీఎం సీ.హెచ్.వెంకటరమణ, అధికారులు మొక్క అందించి స్వాగతం పలికారు. స్టోర్‌లలో యంత్రాల విడిభాగాల ప్రక్రియ విధానం, తదితర అంశాలపై చర్చించారు. పిట్ స్టోర్స్‌ను తనిఖీ చేసి స్టోర్స్ మెటీరియల్ ఇన్వెంట్రీ తగ్గించాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించాన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ప్రాజెక్టు అధికారి జె.రాజశేఖర్, డీజీఎం సీహెచ్.కాశీ విశ్వేశ్వరరావు, ప్రాజెక్టు ఇంజనీర్లు ఉదయ భాస్కర్, చంద్రశేఖర్ ఉన్నారు.

రోడ్డుపై మురుగు.. ప్రజల ఇక్కట్లు


రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

రామగుండం: పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ నుంచి మురుగు నీరు మంగళవారం పొంగి ప్రధాన రహదారిపై పారుతోంది. గిర్నీ గల్లీ నుంచి మురుగు నీరు ప్రధాన రోడ్డుపైకి చేరుతుండడంతో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయానికి కాలినడకన వెళ్లే భక్తులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పూర్తిగా పూడుకుపోవడంతో డ్రైనేజీలో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలుస్తోంది. ప్రధాన డ్రైనేజీ నుంచి మురుగు నీరు పెద్ద చెరువులోకి చేరాల్సి ఉండగా చెరువు పూర్తిగా ఎన్టీపీసీ బూడిదతో నిండిపోయింది. దీంతో మురుగు నీరు నిలిచి లోతట్టులో ఉన్న గృహాల పైపులైన్ నుంచి ఇళ్ల సమీపంలో నిలుస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఎండాకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే వచ్చే వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నూతన డ్రైనేజీ నిర్మాణంతోనే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

షాపింగ్ కాంప్లెక్సు గదులు పూర్తయ్యేదెన్నడో?


అసంపూర్తిగా ఎంపీడీవో షాపింగ్ కాంప్లెక్సు గదులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద ఎంపీడీవో ఆఫీసు వారు నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్సు గదుల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. కొద్దిపాటి పనులు పూర్తి చేసి ఈ గదులను వినియోగంలోకి తెస్తే ప్రభుత్వానికి కొంతమేర ఆదాయం సమకూరే అవకాశముంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి అసంపూర్తిగా ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.